@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || ఆదివారం 11, ఫిబ్రవరి 2024 || పేజీలు: 04

## రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ

- రుణమాఫీకి బడ్జెట్‌లో మొండిచేయి..
- బడ్జెట్‌పై హరీష్‌రావు పెదవి విరుపు..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 10:

అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని మాజీమంత్రి, సిద్ది పేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రజాపాలన అభాసుపాలు అయ్యిందని చెప్పారు. అన్నదాతలను ఆగం చేసే విధంగా బడ్జెట్ ఉందన్నారు. అంకెలను మార్చి ఆంక్షలు పెట్టే విధంగా బడ్జెట్ ఉందని హరీశ్ రావు మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన రూ. 19 వేల కోట్ల నిధుల్లో రైతు భరోసా ఎలా అమలు మిగతా 2లో..



## బుడ్డార్‌ఖాన్‌లా రేవంత్ మాటలు

- బడ్జెట్ నిరాశ కలిగించింది..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 10:

తెలంగాణ సర్కారు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉందని రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిగతా 2లో..



## మేడిగడ్డ అక్రమాలపై న్యాయవిచారణ

### సచివాలయం, అమరుల స్థూపం అక్రమాలపైనా..

### ఆ తర్వాత చర్యలు తప్పవు: సీఎం రేవంత్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 10:

మేడిగడ్డ అక్రమాలపై న్యాయవిచారణ జరిపిస్తమని,విచారణ తర్వాతే చర్యలుంటాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరి తాము అబద్దాల బడ్జెట్ ప్రవేశపెట్ట లేదని, వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వనికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయం చేయని భూములకు కూడా రైతుబంధు వెళ్తుందన్నారు. బీఏసీకి హరీష్ రావును అనుమతించని అంశంపై రేవంత్ రెడ్డి స్పందించారు. బిఏసీకి హాజరయ్యే పేర్లను బీఆర్ఎస్సే ఇచ్చిందని.. అందులో ఎవరి పెరు ఉంటే వారిని పిలుస్తారన్నారు. హరీష్ రావు అర్ధంపర్ధం లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గతంలో బీఏసీ లో ఎలాంటి నిర్ణయాలు ఉన్నాయో అవి అమలు అవుతున్నాయన్నారు. తన భాషపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శల్ని రేవంత్ తిప్పి కొట్టారు. తెలంగాణ భాషనే మాట్లాడుతున్నానన్నారు. అబద్దాల ప్రాతిపదికన బడ్జెట్ పెట్ట దలచుకోలేదు..వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్ పెట్టాం. అబద్దాలు చెపితే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి సంవత్సరం అంతా అబద్దాలు చెప్పాలన్నారు. మిత్తి కట్టలేకనే రైతులు అవమానంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కమీషన్ల కోసం టెండర్లు పిలిస్తే గత ప్రభుత్వం లాగే అవుతుందన్నారు. రుణమాఫీచేస్తామని.. స్పష్టం చేశారు. అభివృద్ధిలో ఏ మిగతా 2లో..





## ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2,75,891కోట్లు

రెవెన్యూ వసూళ్లు 2,05,601

రెవెన్యూ వ్యయం 2,01,177

రెవెన్యూ మిగులు 4,424

### ఇచ్చిన హామీలకు బడ్జెట్లో పెద్దపీట..

### రూ.53,000 కోట్ల కేటాయింపు

- సెగ్మెంట్‌కు 3,500 ఇందిరమ్మ ఇళ్లు.. రూ.7,740 కోట్లు
- ఉచిత విద్యుత్తుకు 2418 కోట్లుబీ ఆర్టీసీకి నెలకు 300 కోట్లు
- మూసీ ప్రక్షాళనకు వెయ్యి కోట్లు.. 3 జోన్లుగా ప్రణాళికలు
- గురుకుల స్కూళ్ల శాశ్వత భవనాలకు రూ.1250 కోట్లు
- జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి 5 లక్షలు
- ఉస్మానియా ఆస్పత్రికి కొత్తభవన నిర్మాణం
- కృత్రిమ మేధతో ప్రజల జీవన స్థితిగతుల మార్పు
- అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, ఫిబ్రవరి 10:

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా** తమ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకువస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఇందుకోసం ఎన్ని త్యాగాలు చేసేందుకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గత పాలకులు ప్రణాళిక, హేతుబద్ధత లే కుండా చేసిన అప్పులు.. ప్రస్తుతం పెద్ద సవాళ్లుగా మారాయని, సహేతుక కార్యాచరణతో ఈ సవాళ్లను అధిగమిస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్స రానికి తొలి బడ్జెట్‌ను ఓటాన్ అకౌంట్ రూపంలో శనివారం శాసనసభలో ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క దీనిని ప్రవేశపెట్టి బడ్జెట్ ప్రసంగం చేశారు. మిగతా 2లో..



## ప్రభుత్వ హామీని అమలు చేసిన ఘనత ఆర్టీసీదే

- తెలంగాణ ఉద్యమంలో కార్మికులదే కీలక పాత్ర..
- కొత్తగా వంద బస్సులను ప్రారంభించిన సీఎం రేవంత్

వివరాలు 02లో..





## త్వరలో మరిన్ని జెనరిక్ ఔషధాలు

- మెడ్‌ప్లస్ ఎండీ మధుకర్ రెడ్డి
- ఇప్పటికే 450కి పైగా ఔషధాల విక్రయం
- స్టోర్ జెనరిక్స్ కాన్సెప్టను ప్రారంభించిన మెడ్‌ప్లస్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి 10:

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రిటైల్ ఫార్మసీ చెయిన్ మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ జెనరిక్ ఔషధాలకు మరింతగా ప్రాచుర్యం కల్పించేందుకు స్టోర్ జెనరిక్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా మిగతా 2లో..



## బండి సంజయ్ యాత్ర షురూ..

- కొండగట్టులో పూజలు

నేటి ఫోకస్ న్యూస్, కరీంనగర్-ఫిబ్రవరి 10:

రానున్న లోక్ సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మిగతా 2లో..

నిత్య నూతనంగా వెలువడుతూ..
నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
సంచలన వార్తా కథనాలతో నిత్యం విశేష పాఠకాధరణ పొందుతున్న, నేటి ఫోకస్ న్యూస్ డిజిటల్ తెలుగు దిన పత్రికకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారిగా, నియోజకవర్గాల వారిగా, మండలాల వారిగా, మండలాల వారిగా బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్లు, విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్‌కు సంప్రదించగలరు.
9848488596
FOCUS TV TELUGU

## బుడ్డార్‌ఖాన్‌లా రేవంత్ మాటలు

(మొదటి పేజీ తరువాయి..)

విమర్శించారు. సికింద్రాబాద్‌లో శనివారం జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు రూ.1.25 లక్షల కోట్లు అవసరమవుతాయని, కానీ బడ్జెట్ లో మాత్రం కేవలం రూ.53 వేల కోట్ల మాత్రమే కేటాయించారని కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బుడ్డర్‌ఖాన్‌లా మాట్లాడుతున్నాడని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రతి కరెంటు మీటర్‌కు 200 యూనిట్లకు ఉచిత విద్యుత్ ఇవ్వకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ జల హక్కులను కృష్ణాబోర్డుకు అప్పగించడాన్ని నిరసిస్తూ 13న నల్లగొండలో పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.

## రాష్ట్ర బడ్జెట్ తీవ్ర నిరాశ

(మొదటి పేజీ తరువాయి..)

చేస్తారని ప్రశ్నించారు. రైతు భరోసాకు రూ.22 వేల కోట్ల రూపాయలు అవసరమని తెలిపారు. రైతు రుణమాఫీకు బడ్జెట్లో మొండి చేయి చూపారని హరీశ్ రావు మండిపడ్డారు. రైతు బీమాకు కేటాయింపులు ఎక్కడ ? అని నిలదీశారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పిన మాటలు బోగస్‌గా మారాయని ఆరోపించారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని విమర్శించారు. 24 గంటల కరెంట్ సరఫరాను రాష్ట్రంలో ఎక్కడ ఇస్తున్నారో చూద్దాం పదండి.. లాగ్ బుక్‌లు పరిశీలిద్దాం రావాలని సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీలపై చట్టం చేస్తామని చెప్పారని.. అసెంబ్లీ రెండు సమావేశాలు అయిపోతున్నాయి ఎక్కడ చట్టం? చేశారని ప్రశ్నించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేయలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ఎత్తేసిందన్నారు. కాంగ్రెస్ పచ్చి అబద్దాలు చెబుతోందని ఆక్షేపించారు. జనవరి నెల ఆసరా పింఛన్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిందని ధ్వజమెత్తారు.బడ్జెట్ లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ, పెండింగ్ డీఏలు ఇవ్వాల్సి ఉన్నా.. వాటికి నిధుల కేటాయింపుపై ప్రస్తావనే లేదని హరీశ్ రావు మండిపడ్డారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రజా దర్బార్‌ను ప్రతిరోజూ నిర్వహిస్తామని చెప్పారని.. కానీ అలా జరగడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ వాగ్దానాలుగానే మిగిలిపోయాయని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రకటించిన హామీలపై ప్రజలకు నమ్మకం కలిగించలేదన్నారు.

## మేడిగడ్డ అక్రమాలపై న్యాయవిచారణ

(మొదటి పేజీ తరువాయి..)

పార్టీ ఎమ్మెల్యేలను అయినా కలుపుకుని పోతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇరిగేషన్ పై సభలో శ్వేతా పత్రం ఇరిగేషన్ మంత్రి విడుదల చేస్తారని ప్రకటించారు. అమరవీరుల స్థూపం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయం నిర్మాణాలపై విచారణ జరిపిస్తాం. విజిలెన్స్ విచారణ జరిపాం. జ్యుడిషియల్ విచారణలో అసలు విషయాలు తెలుస్తాయన్నారు. మేడిగడ్డకు వెళ్దామని సభ్యులందరినీ ఆహ్వానించామని.. 13న బీఆర్ఎస్ వాళ్ళకి మీటింగ్ ఉంటే ఒకరోజు ముందు వెనక వెళదాం అన్నా మేం రెడీ అని ప్రకటించారు. పదేండ్లు అయినా కేసీఆర్‌కి బడ్జెట్ అంచనా వేయడం రాలేదు. వాస్తవాలకి అనుగుణంగా బ్జడెట్ ప్రిపేర్ చేసినందుకు భట్టి కి అభినందనలు తెలిపారు. ఇరవై మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ లో చేరుతారని జగ్గారెడ్డి చే సినవ్యాఖ్యలపై రేవంత్ స్పందించారు. బిఆరెస్ ఎమ్మెల్యే ల చేరిక పై జగ్గారెడ్డి మాకు చెప్పలేదన్నారు. చెబితే అధిష్టానం తో మాట్లాడుతామన్నారు. ఎవరైనా సీఎంను కలవవచ్చొని.. వారిపై వాళ్ల పార్టీలో అనుమానం ఉంటే తాను ఏమీ చేయలేనన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రేవంత్ రెడ్డి వరుసగా సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని వెలికి తీయడంపై ఆయన ఫోకస్ పెట్టారు. ఇప్పటికే.. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని తేల్చేందుకు జ్యూడీషియల్, విజిలెన్స్ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పుడు మరో బాంబ్ పేల్చారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిర్మించిన అమరవీరుల స్మారక చిహ్నం, అంబేద్కర్ విగ్రహం, సచివాలయం నిర్మాణాలలో అవినీతి జరిగిందన్నారు. వీటిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై అన్ని విధాలుగా విచారణ చేపడతామన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీపై విజిలెన్స్ విచారణ జరిపించారు. జ్యూడీషియల్ విచారణ చేపడుతున్నారు. జ్యుడిషియల్ విచారణలో అసలు విషయాలు తెలుస్తాయని చెప్పారు సీఎం. మేడిగడ్డకు వెళ్దామని ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించానని చెప్పిన సీఎం.. 13వ తేదీన బీఆర్ఎస్ వాళ్లకు మీటింగ్ ఉంటే వేరే తేదీ చెప్పినా తాము ఆలోచిస్తామన్నారు. ఒకరోజు ముందు లేదా వెనుక వెళదాం అన్నా తాము సిద్ధం అని ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి.



## బండి సంజయ్ యాత్ర షురూ..

(మొదటి పేజీ తరువాయి..)

శనివారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయాన్ని దర్శించుకు న్నారు. ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో అర్చనలు పూర్తయ్యాక మెడిపల్లి నుంచి ప్రజాహిత యాత్ర ప్రారంభించనున్నారు. ఎంపీగా బాధ్యతలు స్వీకరించాక నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన పనులను ప్రజలకు వివరిస్తూ ఆయన యాత్ర సాగనుంది. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. గ్రామాలకు గత బీఆర్ఎస్ సర్కార్ నయా పైసా ఇవ్వలేదని, కేంద్రం ఇచ్చిన నిధుల ద్వారే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. గ్రామాలను అందంగా తీర్చిదిద్దిన సర్పంచిలను బీఆర్ఎస్ రోడ్డున పడేసిందని విమర్శించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి..)

123 అంశాలతో ప్రముఖ తత్త్వవేత్తలు, రాజనీతి శాస్త్రజ్ఞులు, విద్యావేత్తల సూచ నలు కలగలిపి బడ్జెట్‌ను ప్రసంగం సాగింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అయిష్టంగానే ప్రవేశపెడుతున్నామని, కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టిన తర్వాత రాష్ట్రానికి ఎంత మేరకు కేటాయింపులు ఉంటాయనేది పరిగణనలోకి తీసుకొని పూర్తి బడ్జెట్ పెడతామని అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ ఉంటుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే మూడు ప్రధాన అంశాలను దృష్టిలో పెట్టుకొని.. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన పెంచడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన దుబారా వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తామని, కాళేశ్వరం లాంటి నిరర్థక ప్రాజెక్టులను పెంచుకుంటూ పోమని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ వ్యయం రూ.2,75,891 కోట్లుగా ఉంటుందని, రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లుగా, మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా ప్రతిపాదించారు. 'అందరి కోసం మనమందరం' అనే స్ఫూర్తితో చిరకాల ప్రజల ఆకాంక్షలు తీర్చుకోవడానికి సరైన వేదిక ఇప్పుడు దొరికిందనే భావన ప్రజల్లో కలుగుతోంది. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాలనేది మా కృతనిశ్చయం. ప్రజలు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి ఎంతటి సాహసమైనా చేస్తాం. ఎంతటి కష్టాన్నైనా భరిస్తాం. ప్రజలకు నిజమైన ప్రతినిధులుగా ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉన్నాం. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని మాటిచ్చాం. నిర్బంధాలు, నియంతృత్వ ధోరణులు ఉండవని చెప్పాం. ప్రజా సంక్షేమ కోసం ఆరు గ్యారంటీలు ప్రకటించాం. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలకు చట్టబద్ధత కల్పించే ఫైలుపై సీఎం తొలి సంతకం చేశారు. ఇదే మా సంకల్పానికి, చిత్తశుద్ధికి నిదర్శనం. రాష్ట్ర క్లిష్ట పరిస్థితులను ఇదివరకే శ్వేతపత్రం ద్వారా సవివరంగా వెల్లడించాం. గత పాలకుల నిర్వాకంతో ధ నిక రాష్ట్రం కాస్తా పూట గడవడం కూడా కష్టమనేంత కనిష్ఠ స్థాయికి చేరింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజలకు ఏ మాత్రం మేలు చేయని ఆర్భాటాలకు డబ్బు ఖర్చు చేశారు. దీంతో ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దళితబంధుకు రూ.17,700కోట్లు కేటాయించినా.. ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. దివాళా తీసిన ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి మేం దుబారా ఖర్చులు తగ్గించాం. గతానికి భిన్నంగా, వాస్తవానికి చేరువగా రాబడులు అంచనా వేసి, కేటాయింపులు చేశాం.

### ఆరు హామీల కోసం రూ.53196 కోట్లు..

ఆరు హామీలను అమలు చేయడానికి ఈ బడ్జెట్‌లో రూ.53,196కోట్లు ప్రతిపాదించాం. హామీల అమలు విధివిధానాలు ఖరారయ్యాక పూర్తి నిధులు కేటాయిస్తాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి నెలకు రూ.300కోట్లను ఆర్టీసీకి కేటాయించనున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందే సీలింగ్‌ను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. చెల్లింపులు నిరంతరం చేస్తాం. గృహజ్యోతి కింద రూ.500కు సిలిండర్‌తోపాటు 200యూనిట్ల దాకా వినియోగానికి ఉచితంగా విద్యుత్తు అందిస్తాం. ఈ విద్యుత్తు కోసం రూ.2,418 కోట్లను ప్రతిపాదిస్తున్నాం. రైతాంగానికి 24 గంటలపాటు ఉచితంగా విద్యుత్తు అందిస్తాం. ఇందుకోసం డిస్కమ్‌లకు రూ.16,825 కోట్లను ప్రతిపాదిస్తున్నాం. రాష్ట్ర నిధులతోపాటు కేంద్ర నిధులను కూడా వినియోగించుకొని కాకతీయ టెక్స్‌టైల్ పార్కును మరింత అభివృద్ధి దిశగా తీసుకెళతాం. రెండు లెదర్ పార్కులను కూడా అభివ ృద్ధి చేస్తాం. రాష్ట్రం నలుమూలలా ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తాం. డ్రైపోర్టులను అభివృద్ధి చేస్తాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోపాటు ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి వీలుగా కృతిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)ను ఉపయోగించుకుంటాం. రాష్ట్ర వ్యాప్తంగా ఐటీ పరిశ్రమల విస్తరణ కోసం అమెరికాలోని ఐటీ సర్వ్ అనే సంస్థతో సంప్రదింపులు చేస్తున్నాం. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో రూ.35,752 కోట్లు వెచ్చించినా.. గ్రామాలకు పూర్తిస్థాయిలో సురక్షిత మంచినీరు అందలేదు. స్థానికంగా ఉన్న నీటి వనరులను వినియోగించుకోకుండా సుదూర ప్రాంతాల నుంచి పైప్‌లైన్ల ద్వారా నీటిని అందించే ప్రయత్నం చేయడంతో ఖర్చు ఎన్నో రెట్లు పెరిగి.. సమస్యలు తలెత్తాయి. దీనివల్ల కాంట్రాక్టర్లే లాభపడ్డారు. రానున్న రోజుల్లో మిషన్ భగీరథను ప్రక్షాళన చేస్తాం. వైద్యరంగానికి ఈ బడ్జెట్‌లో రూ.11,500 కోట్లను ప్రతిపాదిస్తున్నాం. ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవన నిర్మాణం చేపడతాం. నిమ్స్ విస్తరణ, సూపర్ స్పెషాలిటీతోపాటు ఇతర ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తాం. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా మారుస్తాం. హైదరాబాద్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తాం. మూసీ ప్రక్షాళనతో పాటు మూసీ పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్‌గా మార్చే కార్యాచరణ మొదలుపెట్టాం. హైదరాబాద్ మెడలో అందమైన హారంలాగా మూసీనదిని తీర్చిదిద్దుతాం. దీనికోసం రూ.1000 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం. రైతుబంధు పథకంతో పెట్టుబడిదారులు, అనర్హులే ఎక్కువ లాభం పొందారు. సాగుచేయని, సాగుకు పనికిరాని కొండలు, గుట్టలు, చివరికి రోడ్లు ఉన్న స్థలానికీ రైతుబంధు సాయం అందించారు. ఇకపై సాగుచేసే భూములకే రైతుభరోసా కింద సాయం చేస్తాం. ఎకరానికి రూ.15వేల చొప్పున అందిస్తాం. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తాం. రైతులకు రూ.2 లక్షల దాకా రుణమాఫీ కోసం త్వరలోనే కార్యాచరణ చేపడతాం. ప్రతి పంటకూ మద్దతు ధర కల్పిస్తాం. బెంగాల్‌లో అమలవుతున్న పంటల బీమాను అధ్యయనం చేసి అమలు చేస్తాం. కౌలు రైతులకు కూడా బీమా అందిస్తాం. రాష్ట్రంలో ఆయిల్‌ఫామ్ సాగు విస్తరణ పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. ధరణిపై కమిటీ వేశాం. త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లేన్ రహదారి సౌకర్యం ఏర్పాటు చేస్తాం. రీజినల్ రింగురోడ్డుకు భూసేకరణకు నిధులు కేటాయించి, పనులు చేస్తాం. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగం 82 నిమిషాలపాటు సాగింది. నిర్దేశిత షెడ్యూల్‌కు ఆరు నిమిషాల ముందే ఉదయం 11:54 గంటలకే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూట్‌కేసుతో సభలోకి వచ్చారు. అయితే సభ్యులు నిర్ణీత సమయంలోగా రాకపోవడంతో రెండు నిమిషాలు ఆలస్యంగా బడ్జెట్ ప్రసంగం ప్రారంభమైంది. భారత రాజ్యాంగ పీఠికను గుర్తు చేసుకుంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం.. పలువురు తత్వవేత్తలు, రాజనీతి శాస్త్రజ్ఞుల సూక్తులతో కొనసాగించారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే డిప్యూటీ సీఎంను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. సభను సోమవారం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాగా,మండలిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. తొలుత.. సభలోకి ప్రవేశించగానే బీఆర్ఎస్ సభ్యుల సీట్ల వద్దకు వెళ్లి సంప్రదాయంగా కలిశారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ మూడో రోజు కూడా బడ్జెట్ సమావేశాలకు హాజరు కాలేదు. శనివారం శాసనసభకు కేసీఆర్ వస్తారన్న ప్రచారం జరిగినా.. ఆయన రాలేదు.

జాబ్ క్యాలెండర్ తయారు చేసే ప్రక్రియను ప్రారంభిస్తాం. మెగా డీఎస్సీ నిర్వహిస్తాం. 15 వేల మంది కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ త్వరలోనే పూర్తిచేస్తాం. ఇల్లు లేని వారికి ఇంటి స్థలం ఇస్తాం. స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల సాయం అందిస్తాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేస్తాం. దీనికోసం రూ.7740 కోట్లను కేటాయిస్తాం. కాంట్రాక్టర్ల కోసం ప్రాజెక్టులు నిర్మించే విధానం తెలంగాణకు శాపంగా మారింది. రూ.లక్షల కోట్ల ఖర్చులో అవినీతి ఎంతో తేల్చాల్సిన బాధ్యత మాపై పడింది. దీనిపై విచారణ జరిపిస్తాం. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాపై ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాం. ప్రాణహిత-చేవెళ్లతోపాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు అందించే ప్రాజెక్టులను సత్వరం చేపట్టాలని నిర్ణయించాం. నీటిపారుదల శాఖకు రూ.28,024 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదిస్తున్నాం. నియోజకవర్గాల అభివద్ధి కోసం నిధులు విడుదల చేస్తాం. రాష్ట్ర బడ్జెట్‌లో ఈసారి మైనార్టీల సంక్షేమానికి కేటాయింపులు పెరిగాయి. మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం రూ.2262 కోట్లు కేటాయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఏడాదితో చేసిన కేటాయింపులతో పోలిస్తే ఇది రూ.62కోట్లు అదనం. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు రూ.2200 కోట్లు కేటాయించింది. కానీ, గత డిసెంబరులో అధికారం కోల్పోయేనాటికి వాటిలో మూడో వంతు నిధులను కూడా కేటాయించలేదు. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలకు ఇస్తున్న రూ.లక్ష నగదుకు అదనంగా తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ పథకం అమలుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటివలే అధికారులను ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో 10 గ్రాముల బంగారం పథకం త్వరలో అమలులోకి రానుంది. అలాగే, ఎన్నికల సమయంలో మైనార్టీ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పలు హామీలు ఇచ్చింది. పీహెచ్‌డీ పూర్తి చేసిన మైనార్టీలకు రూ.5లక్షల నగదు ఇందులో ఒకటి. ఈ హామీని ప్రభుత్వం ఇదే ఏడాదిలో అమలు చేసే అవకాశం ఉంది.

### గురుకులాలకు సొంత భవనాల కోసం రూ.2,796 కోట్లు

రాష్ట్రంలోని గురుకులాలకు మహర్దశ రాబోతోంది. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాలను నిర్మించేందుకు సర్కారు తాజా ఓట్-ఆన్-బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిట, సాధారణ గురుకులాలు 1,022 ఉన్నాయి. వీటిలో 394 మాత్రమే సొంత భవనాల్లో.. 628 గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాల నిర్మాణానికి రూ.2,796 కోట్లను సర్కారు కేటాయించగా.. ఇందులో బీసీ గురుకులాలకు రూ.1,546 కోట్లు, ఎస్సీ గురుకులాలకు రూ.వెయ్యి కోట్లు, గిరిజన గురుకులాలకు రూ.250 కోట్లు దక్కనున్నాయి. దీంతోపాటు.. గురుకుల విద్యాసంస్థల పరిధిలో కొత్తగా రెండు మేనేజ్‌మెంట్(ఎంబీఏ) కాలేజీలను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

### ఇందిరమ్మ ఇంటికి నిధులు.. రూ.7,740 కోట్లు

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ.. ఇందిరమ్మ ఇల్లు పథకానికి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కింది. ఈ హామీని నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.7,740 కోట్లను కేటాయించింది. ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని వారికి... అలాగే స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చింది. నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్టు ప్రభుత్వం బడ్జెట్ సమావేశంలో ప్రకటించింది. కాగా గత ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకం కింద సొంత జాగాలో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించినా... పూర్తిస్థాయిలో ఆ పథకం అమలుకు నోచుకోలేదు.

### పంచాయతీరాజ్ శాఖకు రూ.8,654 కోట్లు అదనం..

కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ముఖ్యమైన మహాలక్ష్మి, చేయూత పథకాల అమలుకు బడ్జెట్‌లో రూ.8,654 కోట్లు అదనంగా ప్రతిపాదించారు. గత బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.31,426 కోట్లు కేటాయించగా.. కొత్త సర్కారు రూ.40,080 కోట్లు ప్రతిపాదించింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రధానంగా ఈ నిధులను వెచ్చించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గత ప్రభుత్వంలో పంచాయతీలు స్వతంత్రంగా నిధులు వాడుకునే అవకాశం లేకుండా ఆంక్షలు విధించడంతో అభివృద్ధి పనులు చేపట్టలేక సర్పంచ్‌లు అవస్థలు పడ్డారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా స్వతంత్రంగా నిధులు వాడుకునేలా వెసులుబాటు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదించిన కారణంగా పంచాయతీరాజ్ శాఖకు కేటాయించిన రూ.40,080 కోట్ల నిధుల్లో ఏ విభాగానికి ఎంత అనేది వర్గీకరించలేదు.

### బడ్జెట్‌లో ప్రతిపాదించిన ప్రాధాన్య ప్రాజెక్టులు..

ప్రాజెక్టు ఇంకా ఖర్చు చేయాల్సింది ఆయకట్టు

పాలమూరు-రంగారెడ్డి రూ.2,050 కోట్లు(అంచనా) 2.8 లక్షల ఎకరాలు

ప్రాణహిత-చేవెళ్ల రూ.9,000.59 కోట్లు 2 లక్షల ఎకరాలు

ఇందిరమ్మ వరద కాలువ రూ.1,971 కోట్లు 2.02 లక్షల ఎకరాలు

దేవాదుల ఎత్తిపోతల రూ.3,687.72 కోట్లు 1.91 లక్షల ఎకరాలు

కల్వకుర్తి ఎత్తిపోతల రూ.357.47 కోట్లు 1.44 లక్షల ఎకరాలు

జవహర్ నెట్టెంపాడు రూ.43.84 కోట్లు 98 వేల ఎకరాలు

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రూ.4,467 కోట్లు 1.27 లక్షల ఎకరాలు

రాజీవ్ భీమా రూ.8 కోట్లు 45 వేల ఎకరాలు

కొమరం భీం రూ.101.22 కోట్లు 22 వేల ఎకరాలు

కోయిల్‌సాగర్ రూ.64.82 కోట్లు 12 వేల ఎకరాలు

చిన్న కాళేశ్వరం రూ.283.37 కోట్లు 45 వేల ఎకరాలు

చనకా కొరాటా రూ.980.93 కోట్లు 50 వేల ఎకరాలు

నారాయణపేట-కొడంగల్ రూ.2,950.50 కోట్లు లక్ష ఎకరాలు

## గృహజ్యోతికి రూ.2,418 కోట్లు

**తొలి విడతలో 34.59 లక్షల మందికి రాయితీ**

**బడ్జెట్‌లో విద్యుత్ సబ్సిడీ రూ.16,825 కోట్లు**

ఎన్నికల హామీల్లో కీలకమైన గృహజ్యోతి తొలి విడత అమలుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.2,418 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద ప్రస్తుతం 34.59 లక్షల మందికి 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తును అమలు చేయనున్నారు. ఫిబ్రవరి నుంచే గృహజ్యోతి అమల్లోకి వచ్చింది. పథకానికి అర్హులైనవారు మార్చిలో బిల్లులు కట్టాల్సిన అవసరం లేదు. కాగా, డిస్కమ్‌లకు ఏటా ఇచ్చే సబ్సిడీని ప్రభుత్వం పెంచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.16,825 కోట్లను రాయితీగా ఇస్తామని బడ్జెట్‌లో పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇది రూ.11,500 కోట్లుగా ఉంది. మరోవైపు రూ.16 వేల కోట్లతో 27.48 లక్షల మంది రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు అందించనున్నారు.



## త్వరలో మరిన్ని జెనరిక్ ఔషధాలు

(మొదటి పేజీ తరువాయి..)

సుమారు 600కు పైగా పేటెంట్ థెరాప్యుటిక్, కీలకమైన ఔషధాలను కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ భాగస్వాముల ద్వారా తీసుకోనుంది. మెడ్‌ప్లస్ బ్రాండ్ పేరుతో ఈ ఔషధాలను తన రిటైల్ ఫార్మసీల ద్వారా విక్రయించనుంది. ఈ జెనరిక్ ఔషధాల్లో రక్తపోటు, మధుమేహం, హృద్రోగ వ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధుల్లో ఉపయోగించే ప్రిస్క్రిప్షన్ ఔషధాలతో పాటు ఓవర్ ది కౌంటర్ (ఓటీసీ) ఔషధాలు ఉన్నాయని మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ఎండీ, సీఈఓ గంగాడి మధుకర్ రెడ్డి తెలిపారు. దేశంలోని అన్ని ప్రధాన ఫార్మా కంపెనీలకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో జెనరిక్ ఔషధాలను సరఫరా చేసే కాంట్రాక్ట్ డ్రగ్ మాన్యుఫ్యాక్చరింగ్ సంస్థ (సీడీఎంఓ)ల నుంచి తాము కూడా ఔషధాలను పొందుతున్నట్లు ఆయన చెప్పారు. సీడీఎంఓల నుంచి నేరుగా జెనరిక్ ఔషధాలను పొందుతుండటంతో మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ వ్యయాలు చాలా తక్కువగా ఉంటాయన్నారు. దీంతో తమ ఫార్మసీ రిటైల్ నెట్‌వర్క్ ద్వారా విక్రయిస్తున్న ఈ ఔషధాలపై 60 నుంచి 80 శాతం వరకు డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు మధుకర్ తెలిపారు. కాగా బ్రాండెడ్ జెనరిక్స్‌పై 20 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. అకుమ్స్ ఫార్మాతో జట్టు: జెనరిక్ ఔషధాల కోసం హరిద్వార్ కేంద్రంగా ఉన్న అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌తో పాటు విండ్‌లాస్ బయోటెక్, హెటిరో కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మధుకర్ వెల్లడించారు. ఈ కంపెనీలు యూరోపియన్ యూనియన్, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణాలకు అనుగుణంగా ఔషధాలను తయా రు చేస్తాయని వివరించారు. మొత్తం జెనరిక్ ఔషధాల్లో అకుమ్స్ ఫార్మా సరఫరా చేసే ఔషధాల వాటా 70 శాతం వరకు ఉండనుందన్నారు. కాగా త్వరలోనే ఈ ఔషధాల పోర్టుఫోలియోను 800కు చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. గత ఏడాది జూన్ నుంచి తెలంగాణలో పైలెట్ ప్రాతిపదికన ఈ జెనరిక్ ఔషధాల విక్రయాలను ప్రారంభించామని, ఆ తర్వాత దశలవారీగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు విస్తరించినట్లు మధుకర్ చెప్పారు. ప్రస్తుతం పదికి పైగా రాష్ట్రాల్లో మెడ్‌ప్లస్ 4,200 ఫార్మసీ స్టోర్లను నిర్వహిస్తోంది.



# సేవాలాల్ మహారాజ్‌కు దక్కిన గౌరవం

◆ గిరిజన సంఘాల నేతలు

వనపర్తి ప్రతినిధి (నేటి ఫోకస్ న్యూస్):

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో సేవాలాల్ మహారాజ్ కు సరైన గౌరవం లభించిందని గిరిజన సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, పెద్దమందడి మండలం ముందరి తండా సర్పంచ్ జయంతి పిజివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ కోఆర్డినేటర్ అరవింద్ ల ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ లో సేవాలాల్ మహారాజ్ చిత్రపటం తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రతన్ నాయక్ కిషన్ నాయక్ తిరుపతి నాయక్ నరేష్ నాయక్ భగవాన్ నాయక్ చరణ్ నాయక్ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ ఎడ్‌సెట్ షెడ్యూల్ విడుదల

◆ మార్చి 6 నుంచి దరఖాస్తులు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి10:

రాష్ట్రంలోని బీఎడ్ కాలేజీల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే టీఎస్ ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. మార్చి 4వ తేదీన టీఎస్ ఎడ్‌సెట్-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ టీ మృణాళిని వెల్లడించారు.మార్చి 6వ తేదీ నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించనున్నారు. ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా మే 6వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించొచ్చు. ఆలస్య రుసుంతో మే 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 23న కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాతపరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు విడతల్లో రాతపరీక్ష నిర్వహించనున్నారు.

# మూసీ అభివృద్ధికి రూ.1000 కోట్లు

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10:

ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2,75,891 కోట్లతో మంత్రి భట్టువిక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో మూసీ అభివృద్ధికి రూ.1000 కోట్లు ప్రతిపాదించారు. హైదరాబాద్ మెడలో అందమైన హారంలా మూసీ నదిని తీర్చిదిద్దుతామని చెప్పారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంటు ప్రాజెక్టులో భాగంగా పాదచారుల జోన్లు, పీపుల్స్ ఎ÷-లాజాలు, ఓల్డ్ సిటీలోని హెరిటేజ్ జోన్లు, హాకర్స్ జోన్లు, చిల్డ్రన్స్ థీమ్స్ పార్కులు, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు అభివృద్ధి చేస్తామన్నారు. మూసీ నదిని, నదీ తీరాన్ని ఒక పర్యావరణహిత పద్ధతిలో సమగ్ర ప్రణాళికతో అద్భుతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. సాంస్కృతిక కట్టడాల పరిరక్షణ కూడా ఇందులో భాగంగా అమలు చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు చార్మినార్ హైటెక్‌సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం వంటి పర్యాటక స్థలాలతో పోటీపడుతుందనడంతో ఎలాంటి సందేహం లేదన్నారు.

# బడ్జెట్‌ను ఆమోదించిన కేబినేట్

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10:

తెలంగాణ అసెంబ్లీ కమిటీ హాల్‌లో రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమై, మూడు నెలల కోసం రూపొందించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చించి దాన్ని ఆమోదించింది. మధ్యాహ్నం 12 గంటలకు ఉభయ సభల్లో ప్రవేశ దీనిని పెట్టారు. శాసన సభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసన మండలిలో ఐటీ మంత్రి శ్రీధర్ బాబు బడ్జెట్ ప్రవేశ పెట్టారు.ఆరు గ్యారంటీలతోపాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రధానంగా దృష్టి పెట్టి కేటాయింపులు జరిపారు. అయితే ఇది తాత్కాలిక బడ్జెట్ అని ఇందులో పూర్తి స్థాయి కేటాయింపులు ఉండబోవని భట్టి అన్నారు. పూర్తి స్థాయి బడ్జెట్ జూన్ లో ప్రవేశ పెట్టనున్నారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క... బడ్జెట్లో అన్ని అంశాలు ఉంటాయన్నారు. ఎన్నికల టైంలో పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఆస్తులు.. అప్పులతో పాటు .. కేంద్రం నుంచి వచ్చే ఆదాయంపై కూడా సభలో స్పందిస్తానన్నారు.

# టీఎస్‌పీఎస్సీకి బ్జడెట్‌లో రూ.40 కోట్లు

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10: బడ్జెట్‌లో నిరుద్యోగులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలను నిర్వహించే టీఎస్‌పీఎస్సీకి బ్జడెట్‌లో రూ.40 కోట్లు కేటాయించినట్టు మంత్రి తెలిపారు. యువకులను రెచ్చగొట్టడం కాదు. అక్కున చేర్చుకుంటాం. వారికి ఆసరాగా ఉంటాం ఆదుకుంటాం. జాబ్ క్యాలెడర్ ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేస్తాం. త్వరలోనే మెగా డీఎస్సీ ఉంటుంది. త్వరలో 15 వేల కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ చేసి, నియామక పత్రాలు ఇస్తాం. గ్రూప్ -1లో 64 ఉద్యోగాలని చేర్చి భర్తీ చేయబోతున్నాం. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ గ్రూప్ -1 ఉద్యోగాలను ఇవ్వలేదని అన్నారు.శాసనసభలో ఓటాన్ అకౌంట్ బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం రూ.2,75,891కోట్లతో బ్జడెట్‌ను ప్రవేశపెట్టారు. అందులో రెవెన్యూ వ్యయం రూ.2,01,178 కోట్లు కాగా.. మూలధన వ్యయం రూ.29,669 కోట్లుగా పేర్కొన్నారు.

# నియోజకవర్గానికి 3,500 ఇండ్లు

◆ బడ్జెట్‌లో రూ.7,740కోట్లు కేటాయింపు

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10: ప్రతీ నియోజకవర్గానికి రూ. 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపడుతామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో ప్రకటించారు. గత సర్కార్ పేదలకు డబుల్ బెడ్ రూంలని మోసం చేసిందని.. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టామని తెలిపారు. ఇళ్లు లేనివారికి ఇండ్లు, స్థలం ఉంటే.. నిర్మాణానికి రూ. 5 లక్షల సాయం చేస్తామని.. ఆ నిధులను కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఇవ్వబోతున్నామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3వేల500 ఇండ్ల చొప్పున ఇస్తామని.. ఈ బడ్జెట్ లో రూ. 7,740 కోట్లు కేటాయిస్తామని తెలిపారు. పరిశ్రమల శాఖకు రూ. 2543 కోట్లు కేటాయించామన్నారాయన. పంచాయతీరాజ్ శాఖకు రూ. 40, 080 కోట్లు కేటాయించామని వివరించారు. ఉపాధి కల్పన జోన్ గా మూసీ పరివాహక ప్రాంతం ఉందని చెప్పారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల కోసం రూ. 500 కోట్లు.. యూనివర్సిటీల్లో సదుపాయాల కోసం రూ. 500 కోట్లు కేటాయిస్తామన్నారు.

# కూలిన షోరూమ్ బిల్డింగ్ పైకప్పు

◆ 8 కొత్త హోండా బైకులు ధ్వంసం

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10: రంగారెడ్డి జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. బిల్డింగ్ పైకప్పు ఊడి హోండా షోరూంలో పడ్డాయి. సిబ్బంది భయాందోళనతో బయటకు పరుగుతీశారు. అక్కడే ఉన్న కొత్త బైకులు ధ్వంసం అయ్యాయి. వివరాల్లోకి వెళితే శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గణెలిష్ కాంప్లెక్స్ భవనం నిర్మించి దాదాపు 40 ఏళ్ల అయ్యింది. బిల్డింగ్ పాత పడటంతో సరైన మరమత్తులు లేక శిథిలావస్థకు చేరింది. బిల్డింగ్ లోని గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న హోండా షోరూంలో ఒక్కసారిగా పైకప్పులు ఊడిపడ్డాయి. ఫోరూంలోని 8 వాహనాలు ధ్వంసం అయ్యాయి. సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులకు ఇన్ ఫాం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

# తీరుమారని బీఆర్ఎస్..

◆ కృష్ణాజలాలపై అబద్దాలతో వంచన

◆ గతమంతా బంగారు తెలంగాణతో మోసం




హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10:

అసెంబ్లీలో కూడా అబద్దాలు చెప్పడం ద్వారా బిఆర్ఎస్ తన అహంభావాన్ని మరోమారు చాటుకుంది. కృష్ణా జలాల విషయంలో ఆ పార్టీ చేసిన వాదన పసలేనిది. గత పదేళ్ల పాలనలో అబద్ధాలు, అర్థఋసత్యాలతో ప్రజలను మోసం చేశారు. తెలంగాణను దివాళా తీయిం చారు. ఓ నలుగురి కోసం మొత్తం తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టారు. అబద్దాలు ప్రచారం చేసి ప్రజలను నమ్మించారు. మేడిపండు చందంగా అభివృద్ధి డొల్ల అని తేలింది. అయినా బింకం చావలేదు. అహం వీడలేదు. అసెంబ్లీలో తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రెండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్‌నామ్ చేయాలన్న వాదాన్ని పాటించారు. ఇంత కన్నా దారుణం మరోటి ఉండదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డా ..బంగారు తెలంగాణ.. కల సాకారం కాలేదు. తెలంగాణ ఏర్పడితే అంతా మంచే జరుగుతుందనుకున్న వారు మోసపోయారు. బలిదానాలు ఇచ్చిన వారి కుటుంబాల అతీగతీ లేదు. ప్రజలకు ఊరట దక్కలేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కలేదు. ఉపాధి కోసం ఎదురు చూసిన వారి కళ్లు కాయలు కాస్తున్నా పట్టించుకోలేదు. తెలంగాణ ఉద్యమ జెండా మోసిన వారంతా దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. ప్రగతి భవన్ సామాన్యులకు అందుబాటు లో లేకుండా చేశారు. నాటి సిఎం కెసిఆర్‌ను కలవాలనుకుంటే కుదరదని శిలాశాసనం రాసారు. గతంలో ఉమ్మడి ఎపిలో సిఎంలను కలవాలనుకుంటే ఇంతగా ఇబ్బంది ఉండేది కాదు. జెండాలు మోసిన జర్నలిస్టులు అధోగతి పాలయ్యారు. వారిని పురుగుల కన్నా హీనంగా చూసారు. ఏ పని చేసినా ఓట్లు రాబట్టుకునే ఆలోచనలో నాటి తెలంగాణ ప్రభుత్వం నడిచింది. దానినే బంగారు తెలంగాణ అంటూ ఊదర గొట్టారు. ప్రధానంగా ధరణిపై వచ్చిన ఆరోపణలను సరిదిద్దుకునే ప్రయత్నం చయకుండా ఎదురుదాడికి దిగారు. తప్పులు జరిగితే..ధరణి మొత్తం బాగాలేదని అంటున్నా రని ఎదురుదాడి చేసారు. అసెంబ్లీలో మంత్రులు దీనిపై వివరణ ఇచ్చి తప్పులు చెబితే ఒప్పుకోవడం కూడా చేతకావడం లేదు. సరిదిద్దుకుం టామని చెప్పలేకపోయారు. ఈ దశలో ఇప్పుడు రేవంత్ నాయకత్వం లో ఏర్పడ్డ ప్రజాపాలన గత వైఫల్యాలను ఎత్తి చూపుతోంది. గతంలో ప్రజలు ఎలా ఉన్నారో ఎప్పుడూ ఆరా తీయలేదు. అరాచకాలు ఎందుకు జరుగుతున్నాయో కనుక్కోలేదు. ఎపిలోనూ గత ఐదేళ్లుగా జగన్ పాలన కూడా అలాగే సాగింది. ఒక్క అవకాశం అంటూ గద్దె నెక్కిన జగన్ పాలన ఎలా ఉందో ప్రపంచమంతా చూస్తోంది. అవినీతి కేసుల్లో కూరుకుపోయిన ఓ నేత ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎవరు రోడ్డెక్కినా పోలీ సులు కేసులు పెడుతున్నారు. లోకేశ్ పాదయా త్రను అడుగడుగునా.. అడ్డుకున్నారు. అమరావతి పై కేంద్రం ప్రకటనతో కిమ్మనడం లేదు. వైఎస్ వివేకా హత్య కేసుపైనా పెదవివిప్పడం లేదు. ఈ సమస్యలను నిలదీయాల్సిన బాధ్యతను ఇప్పుడు షర్మిల చేపట్టారు. ఇకపోతే ఉమ్మడి ఎపిలో ఉన్న నీటి పంచాయితీలే మరింత ఎక్కువగా మళ్లీ మళ్లీ ఉత్పన్నం అవుతున్నాయి. ప్రజల అమాయకత్వా న్ని, అవసరాలను క్యాష్ చేసుకోవడం నేటి రాజకీయంగా మారింది. ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి లోపించంది. ఒకప్పుడు జగనన్న వదిలిన బాణాన్ని అంటూ ప్రచారం చేసుకున్న షర్మిల ఇప్పుడు అన్న అక్రమాలను నిలదీస్తు న్నారు. నిజానికి ఎపిలో రాజన్నరాజ్యం నడవాలి. కానీ అక్కడంతా అరాచక రాజ్యం నడుస్తోంది. రాజధాని అన్నది లేకుండా...మూడు రాజధానులు ఉండాలన్న విపరీత ఆలోచనలు చేస్తున్న పాలకులు ఉన్నారు. రాజధాని లేకుండా రాజ్యం చేస్తున్నారు. అలా ఎందుకు చేస్తున్నారో షర్మిల ప్రశ్నించడంతో నేతలు ఉక్కిరికిబిక్కిరి అవుతున్నారు. మొత్తంగా తెలంగాణ మాదిరి ఎపిలోనూ మంచి జరగాలని కోరుకుంటున్నారు.

# ప్రభుత్వ హామీని అమలు చేసిన ఘనత ఆర్టీసీదే






◆ తెలంగాణ ఉద్యమంలో కార్మికులదే కీలక పాత్ర

◆ కొత్తగా వంద బస్సులను ప్రారంభించిన సిఎం రేవంత్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి10:

ప్రభుత్వ హామీని తొలిసారి అమలు చేసింది ఆర్టీసీ కార్మికులేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. టీఎస్ ఆర్టీసీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 100 ఆర్టీసీ బస్సులను శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో సీఎం ప్రారంభించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో 100 కొత్త బస్సులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. 'కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పుడు కొత్త బస్సులు ప్రారంభించుకుంటున్నాం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులది కీలక పాత్ర అని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడితే తమ సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశించారు.. కానీ, అలా జరగలేదు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేసిన ఆందోళనలో 36 మంది చనిపోయారు. సమ్మెకు దిగారని ఆర్టీసీ కార్మిక సంఘాలను నాటి సీఎం రద్దు చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం. గత ప్రభుత్వం రూ.2.97లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టింది. కానీ, మేం వాస్తవ లెక్కలతో బడ్జెట్ రూపొందించాం. గతేడాది కంటే రూ.15వేల కోట్లు తక్కువతో బడ్జెట్ ప్రవేశపెట్టాం'అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భగా తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ పాత్ర ఎవరు మర్చిపోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఆర్టీసీ కార్మికులు ముందుండి నడిపించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడితే సమస్యలు పరిష్కరిస్తారని ఆర్టీసీ కార్మికులు అనుకున్నారు కానీ పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం మిమ్మల్ని విస్మరించింది. ఎంతో మంది ఆర్టీసి కార్మికులు ప్రాణ త్యాగం చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి మీ కృషి ఏంతో ఉంది. మహాలక్ష్మి స్కీమ్‌ను మేనిఫెస్టోలో పెట్టాం. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ పథకం అమలు చేశాం. 15 కోట్ల 27 లక్షల మంది మహిళలు ఆర్టీసి లో ఉచితంగా ప్రయాణం చేశారని అన్నారు.

# కెసిఆర్ వస్తున్నారంటూ హడావిడి


◆ చివరకు రావడం లేదని తేల్చేసిన నేతలు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఫిబ్రవరి10:

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. విపక్ష నాయకుని హోదాలో తొలిసారిగా శనివారం అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్నారని బీఆర్ఎస్ వర్గాలు ప్రచారం చేశాయి. కానీ బడ్జెట్ ప్రసంగానికి కూడా ఆయన దూరంగా ఉన్నారు. బడ్జెట్ ప్రసంగం తర్వాత అసెంబ్లీ, శాసన మండలి వాయిదా పడ్డాయి. సోమవారం కీలకమైన నీటి ప్రాజెక్టుల అంశంపై చర్చ జరగనుంది. ఆ రోజున కేసీఆర్ సభకు హాజరవుతారా లేదా అన్నది స్పష్టత లేదు. పదమూడో తేదీన నల్లగొండలో బీఆర్ఎస్ భారీ బహిరంగసభ ఏర్పాటు చేసింది. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించారని బీఆర్ఎస్ రాష్ట్రంపై పోరాటం ప్రారంభించింది. రేవంత్ రెడ్డి తాము ఎలాంటి ప్రాజెక్టులు కేంద్రానికి అప్పగించలేదని..బీఆర్ఎస్ హయాంలోనే కొన్ని ప్రాజెక్టులు ఇచ్చారని చెబుతోంది. బీఆర్ఎస్ రాజకీయ. పోరాటానికి కౌంటర్‌గా.. మేడిగడ్డ వద్దకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకెళ్లి .. ప్రాజెక్టులో అవినీతి, బ్యారేజీ కుంగిపోవడం వంటి అంశాలను వివరించాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి హాజరుకాకపోవడంతో సీఎం రేవంత్ తో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉండి బీఏసీ సమావేశానికీ వెళ్లలేదు. తొలి రోజు గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరు కాకపోవడం అసెంబ్లీని అవమానించడమేనన్న విమర్శలను కాంగ్రెస్ నేతలు చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం కేసీఆర్ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ సమీక్షా సమావేశానికి వెళ్లిన కేసీఆర్ అసెంబ్లీ సమావేశానికి ఎందుకు రాలేదని అధికార పక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ మీటింగ్ కు వెళ్లినప్పుడు సహకరించిన ఆరోగ్యం అసెంబ్లీ సమావేశాలకు వెళ్లడానికి సహకరించదా..? అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. నిజానికి బీఏసీ సమావేశానికి కేసీఆర్, కడియం శ్రీహరి హాజరవుతారని ఆ పార్టీ నేతలు పేర్లు ఇచ్చారు. దీంతో ఆయన హాజరవుతారని అనుకున్నారు. కానీ సమావేశానికి మాత్రం ఆయన స్థానంలో హరీశ్ రావు వెళ్లారు.

# పుణ్యక్షేత్రాల అభివృద్ధికి చర్యలు: భట్టి

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10:




పవిత్ర పుణ్యక్షేత్రాలైన వేములవాడ, బాసర , భద్రాచలం, జమాలాపురం( చిన్న తిరుపతి), ధర్మపురిలను అనుసంధానం చేస్తూ టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఈ దేవస్థానాలను మరింత ఆకర్షణీయంగా, భక్తులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.దేవాదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన వేలాది ఎకరాల అన్యాక్రాంత భూములను గుర్తించి వాటిని పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజనుల అతిపెద్ద జాతరైన మేడారం జాతరను ఘనంగా నిర్వహించబోతున్నామని.. సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకోవడానికి అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. భక్తులు వీలుగా బంగారం మొక్కలు చెల్లించుకునేందుకు వీలుగా ఆన్ లైన్ పోర్టల్ కూడా ప్రారంభించామన్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టింది.

## రైతులకు 24 గంటల

# నాణ్యమైన విద్యుత్

### ఉచిత విద్యుత్ పథకానికి రూ.2,0418కోట్లు

హైదరాబాద్, నేటి ఫోకస్ న్యూస్-ఫిబ్రవరి10:



రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కట్టుబడి ఉన్నామని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టీ విక్రమార్క చెప్పారు. శనివారం అసెంబ్లీలో భట్టీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఈ మామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశామని.. త్వరలోనే మరో రెండు గ్యారంటీలను కూడా అమలు చేస్తామని తెలిపారు. ఈ నెలలోనే గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ అందిస్తామని చెప్పారాయన. ఇందుకోసం విధివిధానాలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఉచిత విద్యుత్ పథకానికి బ్జడెట్ రూ.2వేల418కోట్లు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వకున్నా.. ఇచ్చినట్లు ప్రచారం చేసిందని విమర్శించారు. విద్యుత్ డిస్కంలకు నిధులు చెల్లించక పోవడంతో.. అవి అప్పుల్లో కూరుకుపోయాయని చెప్పారు. రాష్ట్రంలో ట్రాన్స్‌కో, డిస్కమ్ లకు ఈ బ్జడెట్ లో రూ.16 వేల 825 కోట్లు కేటాయించడం జరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు.

నేటి ఫోకస్ న్యూస్









# దేవరలో శృతి మరాటే..

**టాలీవుడ్ స్టార్ హీరో** జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న తాజా చిత్రం 'దేవర'. కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీదేవి గారలపట్టి జాన్వీకపూర్ 'దేవర'తో తెలుగు ఇండస్ట్రీకి పరిచయం అవుతుంది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. పోర్ట్ మాఫియా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీ నుంచి అదిరిపోయే గ్లింప్స్‌ను షేర్ చేయగా.. నెట్టింట వైరల్ అవుతోంది. కాగా దేవర పార్టు 1 ముందుగా నిర్ణయించిన ప్రకారం ఏప్రిల్ 5న విడుదల కావడం లేదన్న విషయం తెలిసిందే. సైఫ్ అలీఖాన్‌కు గాయం కావడంతో ఈ మూవీ షూటింగ్‌ను కొద్దిరోజులు నిలిపివేశారు. రీసెంట్‌గా ఈ సినిమా షూటింగ్ మళ్లీ మొదలయినట్లు సమాచారం. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ న్యూస్ వైరల్ అవుతుంది. ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే జాన్వీ కాకుండా మరో కొత్త కథనాయిక ఈ సినిమా నటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంతో మరాఠీ హీరోయిన్ శ్రుతి మరాటే టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై చిత్రయూనిట్ స్పందించాల్సి ఉంది. ఇక మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఈ మూవీని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ, కల్యాణ్ రామ్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

# శ్రద్ధాదాస్ అందాల ఆరబోత

**అటు హిందీలోనూ,** ఇటు దక్షిణాదిలోనూ బిజీగా వున్న నటీమణుల్లో శ్రద్ధ దాస్ ఒకరు. 2008లో 'సిద్దు ఫ్రమ్ శ్రీకాకుళం' అనే తెలుగుసినిమాతో వెండితెరపైకి ఆరంగేట్రం చేసిన శ్రద్ధ దాస్ ఇప్పటివరకు సుమారు 40 సినిమాల కిపైగా వివిధ భాషల్లో చేసింది. అందులో ఎక్కువగా దక్షిణాదికి చెందినవే. సినిమాలతో పాటుగా శ్రద్ధ కొన్ని వెబ్ సిరీస్ లలో కూడా నటించింది. మాస్ కమ్యూనికేషన్ లో డిగ్రీ పూర్తి చేసిన శ్రద్ధ దాస్ ఎప్పుడూ సామజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ తన అభిమానులకి అప్పుడప్పుడు స్పెషల్ ఫోటోషూట్ చేస్తూ కనువిందు చేస్తూ ఉంటుంది. ముంబైలో పుట్టి, అక్కడే పెరిగిన శ్రద్ధ దాస్ తల్లిదండ్రులు బెంగాల్ కి చెందిన వారు. అందుకే చిన్నప్పుడు ఎక్కువగా బెంగాల్ వెళుతూ ఉండేదానిని అని చెపుతూ ఉంటుంది శ్రద్ధ దాస్.






**టాలీవుడ్ యువ నటుడు** శివ కందుకూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. ఈ సినిమాకు పురుషో త్తం రాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. స్నేహాల్, శశిధర్, కార్తీక్ సంయు క్తంగా నిర్మిస్తున్నారు. మార్చి 31వ తేదీన ఈ సినిమా రిలీజ్ కానుంది. ఇక విడుదల తేదీకి ఇంకా నెల రోజులు ఉండగా ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రబృందం. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు. ఇక ఈ ట్రైలర్ గమనిస్తే.. కర్ణాటక ఆంధ్ర బోర్డర్‌లో జరిగిన వరుస హత్యల ఆధారంగా ఈ సినిమా రానున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ హత్యలు ఎవరు చేశారు అని కనిపెట్టే డిటెక్టివ్ భాస్కర్ నారాయణ పాత్రలో శివ కందుకూరి నటిస్తున్నాడు. క్రైమ్ థ్రిల్లర్‌గా రానున్న ట్రైలర్ ప్రస్తుతం యుట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఈ సినిమాలో రాశి సింగ్ కథానాయికగా నటిస్తుండగా.. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నాడు.

# భూతద్ధం భాస్కర్ నారాయణ పాత్రలో శివ

# వెన్నెల కిశోర్ హీరోగా చారి 111




**టాలీవుడ్ స్టార్ కమెడియన్** వెన్నెల కిషోర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'చారి 111'. తమిళ ముద్దుగుమ్మ సంయుక్త విశ్వనాథన్ హీరోయిన్ గా నటిస్తుండగా.. టీజీ కీర్తికుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నా డు. ఈ సినిమా మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భం గా మేకర్స్ ఇప్పటినుంచే ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి కాన్సెప్ట్ టీజర్‌ను విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విపరీత మైన స్పందన వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా ట్రైలర్‌ను ఫిబ్రవరి 12న సోషల్ మీడియా వేదికగా విడుద ల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఒక పోస్టర్ కూడా విడుదల చేశారు. ఇక ఈ సినిమా కథ విషయానికొ స్తే ఓ సీటిలో అనుమానాస్పద ఘటనలు జరుగుతుంటాయి. అవి చేధించే రహస్య గూఢచారి పాత్రలో వెన్నెల కిషోర్ కనిపించనున్నా రు. ఇక సీనియర్ నటుడు మురళి శర్మ ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కిశోర్ సీక్రెట్ స్పైగా కనిపించనుండగా.. మురళి శర్మ స్పై ఏజెన్సీ హెడ్?గా కనిపించనున్నారు. ఈ సినిమాను బర్కత్ స్టూడియోస్ బ్యానర్‌పై అదితి సోని నిర్మిస్తుంది.

# సితార పేరుతో నకిలీ ఇన్‌స్టా..

**సూపర్‌స్టార్ మహేశ్‌బాబు** కుమార్తె సితార పేరుతో కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారు. సితార ఘట్టమనేని పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ ఖాతాలు తెరిచి ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ లింకులు పలువురికి పంపుతున్నట్లు జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ గుర్తించింది. ఇటువంటి వాటిని నమ్మొద్దని ఆ సంస్థ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. దీనికి సంబంధించి మాదాపుర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెలబ్రిటీల పేరుతో ఇలాంటి లింకులు వస్తే అప్రమత్తంగా ఉండాలని జీఎంబీ సంస్థ సూచించింది. సితార గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా కనిపించే ఆమె సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా ఉంటుంది. అప్పుడప్పుడు తన తండ్రి పాటలకు స్టెప్పులేస్తూ సందడి చేస్తుంటుంది. తాజాగా గుంటూరు కారం చిత్రం నుంచి దమ్ మసాలా సాంగ్‌తో అలరించింది.

